# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం - 23 - జూన్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 19 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును భారీగా అభివృద్ధి చేయాలి: సీఎం

- **రాజ్‌నాథ్ సింగ్‌తో రేవంత్ రెడ్డి భేటీ**
- **విమానాశ్రయ విస్తరణకు రాష్ట్రం పూర్తి సహకారం**
- **కార్గో, హ్యాంగర్, మరమ్మతు కేంద్రాల ఏర్పాటుకు విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** భారత వాయుసేన ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్న ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అన్ని ఆధునిక సౌకర్యాలతో విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయంలో జరిగిన భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా గాంధీ సరోవర్ నిర్మాణానికి రక్షణ శాఖ భూములను బదలాయించినందుకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఆయన అభినందించారు.

మిగతా 2లో..



## యూట్యూబర్ వీసా కేసులో పురోగతి

### ఇబ్రహీంపట్నం పోలీసుల విచారణ కొనసాగింపు

### విచారణకు హాజరైన మోహనరావు

### వీసా మోసంపై ఇప్పటికే కేసు నమోదు

**రంగారెడ్డి, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):**

యూట్యూబర్ నందూస్ వరల్డ్‌కు సంబంధించిన వీసా అక్రమాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే నమోదైన ఆరోపణల నేపథ్యంలో మధుకర్ తండ్రి మోహనరావు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. వీసా మోసానికి సంబంధించి గతంలో

మిగతా 2లో..





## మొహర్రం ఏర్పాట్లపై కవిత విమర్శలు

- **బీబీకా ఆలంను సందర్శించిన కవిత**
- **అషుర్ ఖానాలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్**
- **మైనార్టీ సంక్షేమ నిధులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కవిత**

**హైదరాబాద్, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డబీర్‌పురా మొహర్రం సంతాప దినాల్లో భాగంగా దారుల్ షిఫాలోని బీబీకా ఆలంను సందర్శించారు. ఈ సందర్భంగా మొహర్రం ఏర్పాట్లు, మైనార్టీ సంక్షేమ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. మొహర్రం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. అషుర్ ఖానాల నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసి ఏర్పాట్లు సక్రమంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. మొహర్రం అనగానే హజ్రత్ ఇమామ్ హుస్సేన్ కర్బాలా యుద్ధంలో చేసిన త్యాగం గుర్తుకు వస్తుందని కవిత అన్నారు. మానవీయ విలువలు, సత్యం కోసం ఆయన చేసిన త్యాగం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణలో నిజాం కాలం నుంచి అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి పండుగలు జరుపుకునే సంప్రదాయం కొనసాగుతోందని తెలిపారు. సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బీబీకా ఆలం ఊరేగింపులో ఏనుగు ప్రత్యేక ఆకర్షణగా ఉండేదని గుర్తుచేసిన కవిత, సంప్రదాయాలను పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనార్టీల సంక్షేమానికి కేటాయించిన నిధులు కాగితాలకే పరిమితమవుతున్నాయని ఆరోపించిన కవిత, పెండింగ్‌లో ఉన్న మైనార్టీ సంక్షేమ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైనార్టీ వర్గాల అభివృద్ధికి కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



## వర్షాకాలానికి ఆర్‌అండ్‌బీ అప్రమత్తం

- **ప్రత్యేక కార్యాచరణ విధానం విడుదల**
- **వరద ముప్పు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా**
- **అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** వర్షాకాలంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాల రక్షణకు ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యాచరణ విధానాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు వరదల సమయంలో తక్షణ స్పందన కోసం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసేంత వరకు శాఖ అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయిల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను

మిగతా 2లో..

## భువనగిరి కోట అభివృద్ధి పనులు అక్టోబర్ 2లోపు పూర్తి చేయాలి: జూపల్లి

- **పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సమీక్ష**
- **రోప్‌వే సహా పలు అభివృద్ధి పనుల పరిశీలన**
- **భువనగిరిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం**

**భువనగిరి, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** భువనగిరి కోట వద్ద చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనులను అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. కోట ప్రాంతంలో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన మంత్రి, ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోప్‌వే, హోటల్, పార్కింగ్ ప్రాంతాలు, మరుగుదొడ్లు, చిన్నారుల ఆట స్థలం, కోట పునరుద్ధరణ పనులు, ఆహార కేంద్రం, పర్యాటక సమాచార కేంద్రం తదితర అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి పరిశీలించారు. అవసరమైతే రాత్రింబవళ్లు

మిగతా 2లో..



## వర్షాల హెచ్చరిక.. సైబరాబాద్ అలర్ట్

- **ఉద్యోగులను ముందుగానే పంపాలని సూచన**
- **ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక చర్యలు**
- **హైదరాబాద్‌కు ఎల్లో అలర్ట్ జారీ**



**హైదరాబాద్, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, నీటి నిల్వల సమస్యలను తగ్గించేందుకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా సైబరాబాద్ పరిధిలోని సంస్థలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు ఉద్యోగులు, విద్యార్థులను విడతల వారీగా ముందుగానే ఇళ్లకు పంపించాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలో ఈ నెల 27 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో కూడా రాబోయే రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో గతంలో భారీ వర్షాల సమయంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన సంగతి తెలిసిందే. గంటల తరబడి వాహనదారులు రహదారులపైనే చిక్కుకుపోయిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందస్తు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఉద్యోగులందరూ ఒకేసారి కార్యాలయాల నుంచి బయటకు వస్తే ట్రాఫిక్ ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

మిగతా 2లో..

## చిరంజీవిని కలిసిన రాంచందర్ రావు

- **మహా జనసంపర్క్ అభియాన్‌లో భాగంగా భేటీ**
- **మోదీ ప్రభుత్వ విజయాల పుస్తకం అందజేత**
- **రాజకీయ చేరికలపై ఊహాగానాలకు తెర**



**హైదరాబాద్, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవి నివాసానికి వెళ్లిన రాంచందర్ రావు ఆయనతో భేటీ అయ్యి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించినట్లు సమాచారం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేపీ నిర్వహిస్తున్న మహా జనసంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ సమావేశం జరిగింది. సమాజంలోని వివిధ రంగాల ప్రముఖులను కలిసి కేంద్ర ప్రభుత్వ విజయాలను వివరించే కార్యక్రమంలో భాగంగా చిరంజీవిని కలిసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.
ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, దేశ ప్రగతికి సంబంధించిన ప్రత్యేక పుస్తకం, సమాచార కరపత్రాలను రాంచందర్ రావు చిరంజీవికి అందజేశారు. దాదాపు అరగంటకు పైగా సాగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. దేశ ఆర్థిక పురోగతి, సాంస్కృతిక అభివృద్ధి, వినోద రంగంలో జరుగుతున్న మార్పులు, పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై ఇరువురి మధ్య అభిప్రాయాల మార్పిడి జరిగినట్లు సమాచారం. అయితే ఈ భేటీ పూర్తిగా మర్యాదపూర్వకంగానే జరిగిందని బీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ సమావేశం అనంతరం సామాజిక మాధ్యమాల్లో పలు రాజకీయ ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన చిరంజీవి మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారా అనే చర్చ ప్రారంభమైంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం చిరంజీవి పూర్తి స్థాయిలో సినీ రంగంపైనే దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఈ భేటీని రాజకీయ కోణంలో కాకుండా మర్యాదపూర్వక సమావేశంగానే చూడాలని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే రాజకీయ వర్గాల్లో మాత్రం ఈ భేటీపై ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును భారీగా అభివృద్ధి చేయాలి: సీఎం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దేశ భద్రత, రక్షణ పరంగా కూడా ఈ విమానాశ్రయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు.

భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు పౌర విమానయాన శాఖకు సంబంధించిన ప్రయాణికుల టెర్మినల్‌ను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. అలాగే సరుకు రవాణా కేంద్రం, విమానాల మరమ్మతు కేంద్రం, హ్యాంగర్ సదుపాయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగంలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అనేక అంతర్జాతీయ విమానయాన సంస్థలు కొత్త హ్యాంగర్ కేంద్రాల కోసం అన్వేషిస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. భౌగోళికంగా, వాతావరణ పరంగా ఆదిలాబాద్ ఇందుకు అనుకూలంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి విమానయాన కేంద్రంగా తీర్చిద్దాలని సూచించారు. అదేవిధంగా రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు చెందిన కీలక ప్రాజెక్టును మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఆ ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం తెలిపి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భువనగిరి కోట అభివృద్ధి పనులు అక్టోబర్ 2లోపు పూర్తి చేయాలి: జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

పనులు నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. చారిత్రక వైభవాన్ని కాపాడుకుంటూనే భువనగిరి కోటను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక వలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశ విదేశాల నుంచి మరింత మంది పర్యాటకులు ఆకర్షితులవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్ పథకం రెండో దశ కింద రూ.56.81 కోట్లతో భువనగిరి కోట అనుభూతి కేంద్రం అభివృద్ధి ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.17.91 కోట్లతో సుమారు 1,020 మీటర్ల పొడవు గల రోప్‌వే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. గంటకు 250 నుంచి 300 మంది ప్రయాణికులను తరలించే సామర్థ్యంతో ఈ రోప్‌వే నిర్మాణం చేపడుతున్నారు. మిగిలిన రూ.38.90 కోట్లతో కోట వారసత్వ నిర్మాణాల పునరుద్ధరణ, రహదారులు, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, సీసీ కెమెరాలు, భద్రతా వ్యవస్థలు, పర్యాటక సౌకర్యాల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యూట్యూబర్ వీసా కేసులో పురోగతి

(మొదటి పేజీ తరువాయి)

క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మధుకర్, నందు, మధుకర్ తండ్రి మోహనరావులను నిందితులుగా చేర్చినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అంశాలపై పూర్తి వివరాలు సేకరించేందుకు పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ క్రమంలో మోహనరావును స్టేషన్‌కు పిలిపించి పలు అంశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. వీసాల పేరుతో మోసం జరిగిందనే ఆరోపణలపై ఇప్పటికే పలు ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. బాధితుల వాంగ్మూలాలు, ఆర్థిక లావాదేవీల వివరాలు, సంబంధిత పత్రాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసిన నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మోహనరావు విచారణ కొనసాగుతోంది. కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం లేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

# రాజ్యాధికార సమరభేరికి సన్నాహాలు

- టీఆర్‌పీ నాయకులతో తీన్మార్ మల్లన్న భేటీ
- భువనగిరి సభ విజయవంతంపై దిశానిర్దేశం
- 16 మండలాల అధ్యక్షులకు నియామక పత్రాల అందజేత



**హైదరాబాద్, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ నాయకులతో హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు కొమ్మరిశెట్టి నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లాలోని 16 మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జూలై 5న భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, జనసమీకరణ, ప్రచార కార్యక్రమాలు, నిర్వహణ ఏర్పాట్లపై నాయకులకు తీన్మార్ మల్లన్న దిశానిర్దేశం చేశారు.

రాష్ట్రంలో పార్టీ విస్తరణకు ఇలాంటి సభలు కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి నాయకుడు బాధ్యతగా పనిచేసి సభ విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణంపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాడాలని నాయకులకు సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని అన్నారు. అనంతరం నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని వారికి సూచించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పసల ప్రసన్న కుమారి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నరసయ్య గౌడ్‌తో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. జూలై 5న జరిగే రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# సింగరేణి ఉద్యోగులకు బీమా భరోసా

- సెంట్రల్ బ్యాంక్‌తో ప్రత్యేక ఒప్పందం
- ప్రమాద మరణానికి రూ.1.5 కోట్ల వరకు రక్షణ
- కార్మిక సంక్షేమంలో మరో ముందడుగు




**కొత్తగూడెం, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కార్మికుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకుంటూ సింగరేణి సంస్థ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా సెంట్రల్ బ్యాంక్‌లో వేతన ఖాతాలు కలిగిన సింగరేణి ఉద్యోగులకు భారీ బీమా రక్షణతో పాటు పలు ప్రత్యేక బ్యాంకింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఒప్పందం ప్రకారం ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యం సంభవించిన సందర్భంలో ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.50 కోట్ల వరకు బీమా రక్షణ లభించనుంది. సహజ మరణం సంభవించిన సందర్భంలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బీమా ప్రయోజనం అందించనున్నారు. దీంతో ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత మరింత బలపడనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో ఈ ఒప్పందం అమలులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. సింగరేణి చైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ ఎ.వి. రమణమూర్తి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా కేవలం బీమా రక్షణ మాత్రమే కాకుండా ఉద్యోగులకు ప్రత్యేక బ్యాంకింగ్ రాయితీలు, సులభ రుణ సదుపాయాలు, ఇతర ఆర్థిక సేవలు కూడా అందుబాటులోకి రానున్నాయి. సింగరేణి ఉద్యోగుల సంక్షేమాన్ని మరింత మెరుగుపర్చడంలో ఇది కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. కార్యక్రమంలో సింగరేణి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉద్యోగుల సామాజిక, ఆర్థిక భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సింగరేణి సంస్థ తీసుకుంటున్న సంక్షేమ చర్యల్లో ఇది మరో ముఖ్యమైన మైలురాయిగా నిలవనుందని అధికారులు పేర్కొన్నారు.

# వర్షాల హెచ్చరిక.. సైబరాబాద్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

అందుకే సాయంత్రం 3:30 గంటల నుంచే విడతల వారీగా ఉద్యోగులను పంపించేలా సంస్థలు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల రహదారులపై రద్దీని కొంత మేర తగ్గించవచ్చని భావిస్తున్నారు.

వర్షాల సమయంలో ప్రజలు అనవసర ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. రాబోయే రోజుల్లో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

# వర్షాకాలానికి ఆర్అండ్‌బీ అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

నిరంతరం కొనసాగించడమే లక్ష్యమన్నారు.

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, నీటిని తొలగించే యంత్రాలు, ఇసుక సంచులు, తారు, కంకర, పైపులు తదితర సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థల హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, సాగునీరు, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు.

భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి తాత్కాలిక పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని మంత్రి స్పష్టం చేశారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, స్థాన వివరాలతో కూడిన పూర్తి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. వర్షపాతం తీవ్రత ఆధారంగా గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ హెచ్చరిక వ్యవస్థను అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. 204 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే రెడ్ అలర్ట్ పరిస్థితుల్లో అధికారులు 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్అండ్‌బీ శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# పంటల కొనుగోళ్లపై రైతుల్లో ఆందోళన: కేటీఆర్

- కాంగ్రెస్ పాలనలో సంక్షోభం నెలకొందని విమర్శ
- రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటోందన్న ఆరోపణ
- కార్యకర్తల అభివృద్ధికి కృషి చేస్తానన్న కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోళ్ల విషయంలో రైతులకు అన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయని విమర్శించారు. రైతుల పంటల కొనుగోళ్లపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించకుండా అయోమయ పరిస్థితి సృష్టిస్తోందని కేటీఆర్ అన్నారు. రైతుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర అభివృద్ధికి చెప్పుకోదగ్గ కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే కేంద్ర ప్రభుత్వ సూచనలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్టీ కార్యకర్తలు, నాయకులపై వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించిన కేటీఆర్, అలాంటి చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతంతో పాటు కార్యకర్తల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని, రైతుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు.






## జీవో-42 ఉల్లంఘన.. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై ఆగ్రహ జ్వాలలు

- ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ కోర్సుల పేరిట తల్లిదండ్రులపై ఆర్థిక భారం
- మండల విద్యాధికారికి ఏఐఎస్‌జేఏసీ వినతి

**జమ్మికుంట టౌన్ జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ జీవో నెంబర్-42ను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, సంబంధిత విద్యా సంస్థలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏఐఎస్‌జేఏసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేడు అనేక ప్రైవేట్ పాఠశాలలు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్, ప్రత్యేక కరిక్యులం, కోకరిక్యులర్ యాక్టివిటీస్ పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులపై వేలాది రూపాయల అదనపు భారం మోపుతున్నాయని ఆరోపించారు. విద్యా సేవలను అందించాల్సిన సంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారి, విద్యార్థుల భవిష్యత్తు కంటే ఫీజుల వసూళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, విద్యా ప్రమాణాలు మరియు ఉత్తీర్ణత శాతాల్లో అనేక పాఠశాలలు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, నాణ్యమైన విద్యపై దృష్టి పెట్టాల్సిన యాజమాన్యాలు ఫీజుల దోపిడీకి పాల్పడటం ఆందోళన కలిగించే విషయమన్నారు. జీవో-42కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారిని కోరినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌జేఏసీ జమ్మికుంట మండల అధ్యక్షుడు గడ్డం సత్య విష్ణు, వరుణ్, కర్మల, సాయిచరణ్, సాయికుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి..

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం బ్యూరో , జూన్ - 22(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జూన్ 30న నిర్వహించనున్న సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు.
అనంతరం జగనాధపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని అన్నారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.
పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని సభా ప్రాంగణం వద్ద మరియు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.
ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండి వరుణ్ రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబర్తి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొణిజర్ల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్




**ఖమ్మం బ్యూరో, జూన్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** కొణిజర్ల పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధిత ఫిర్యాదుదారులతో మాట్లాడారు. అనంతరం స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. సెక్టర్ పోలీస్ ఆఫీసర్లతో మాట్లాడారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు.



## భారీ వర్షాలతో అప్రమత్తమైన మున్సిపల్ యంత్రాంగం.. వరద కాలువలను పరిశీలించిన చైర్మన్

- 30 వార్డుల్లో ముందస్తు చర్యలు పూర్తి
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనివ్వమన్న మున్సిపల్ చైర్మన్

**జమ్మికుంట టౌన్ జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) క్షేత్రస్థాయిలో పర్యటించి వరద నీటి ప్రవాహాలను పరిశీలించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ నుంచి అంబేద్కర్ కాలనీ మీదుగా వెళ్లే వరద నీటి కాలువలను స్వయంగా తనిఖీ చేసి పరిస్థితులను అంచనా వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పట్టణంలోని 30 వార్డుల్లో వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని రకాల నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. డ్రైనేజీలు, వరద కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎక్కడా నీటి సమస్యలు, వరద ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పాలకవర్గం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
పట్టణ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# వావిలాల పీహెచ్‌సీపై ఆకస్మిక తనిఖీ.. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి



**జమ్మికుంట టౌన్ జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హుజురాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వైద్య సేవలు, రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.
ఫార్మసీ గదిని తనిఖీ చేసిన డాక్టర్ ప్రభుదాస్, రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మందులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.
ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు.
ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ తనిఖీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వరుణ, డాక్టర్ శ్రవణ్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, రజిత, కవితతో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రతిజ్ఞ.. వేలేరు పోలీసుల చైతన్య యాత్ర"




**వేలేరు, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వేలేరు మండలం గొల్లకృష్ణంపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేలేరు ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (TGANB) సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా డ్రగ్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించబోమని విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించడంతో పాటు సంతకాల సేకరణ (సిగ్నేచర్ క్యాంపెయిన్) నిర్వహించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎస్సై సురేష్ సూచించారు.
ఈ కార్యక్రమంలో వేలేరు పోలీసులు, 'ప్రహరీ క్లబ్' సభ్యులు, గొల్లకృష్ణంపల్లి గ్రామ సర్పంచ్ బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో మూడు వేర్వేరు కేసులు నమోదు

- షోరూమ్‌లో చోరీయత్నం..
- అక్రమ ఇసుక రవాణా పట్టివేత..
- అదనపు కట్న వేధింపులపై కేసులు

**జమ్మికుంట టౌన్ జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మూడు వేర్వేరు ఘటనలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. షోరూమ్‌లో చోరీయత్నం, అక్రమ ఇసుక రవాణా, అదనపు కట్న వేధింపులపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
మదనపల్లి గ్రామానికి చెందిన తిరుపతి రెడ్డి జమ్మికుంటలో హుజూరాబాద్ రోడ్డుపై శ్రీ సాయి వెహికల్ షోరూమ్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి షోరూమ్ మూసివేసి ఇంటికి వెళ్లిన ఆయన, ఆదివారం ఉదయం వచ్చి చూడగా కౌంటర్ వద్ద పత్రాలు, ఇతర వస్తువులు చిందరవందరగా కనిపించాయి. షోరూమ్‌ను పూర్తిగా పరిశీలించగా ఎటువంటి వస్తువులు చోరీకి గురికాలేదని గుర్తించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు షోరూమ్‌లోకి ప్రవేశించి దొంగతనానికి యత్నించినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
మరో ఘటనలో ఎస్సై ఎన్. రమేష్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా విలాసాగర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్లను నడుపుతున్న చిలువేరి సదయ్య (45), వేల్పుల నాగరాజు (27)లను విచారించగా ఇసుక రవాణాకు సంబంధించిన ఎలాంటి అనుమతి పత్రాలు చూపించలేకపోయారు. దీంతో వారిపై కేసు నమోదు చేశారు.
ఇక అంబేద్కర్ కాలనీకి చెందిన గుల్లి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త గుల్లి రమేష్‌పై అదనపు కట్న వేధింపులు, దాడి కేసు నమోదు చేశారు. వివాహం జరిగినప్పటి నుంచి అదనపు కట్నం కోసం మానసిక, శారీరక వేధింపులకు గురిచేస్తున్నాడని, ఇటీవల మద్యం మత్తులో ఇంటికి వచ్చి స్టీల్ చీపురుతో కొట్టి చంపుతానని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొంది.
ఈ మూడు ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హామీలు గాలికి వదిలి రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం




- **ఖిల్లా ఘనపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన బీఆర్ఎస్ నేతలు**

**ఖిల్లా ఘనపూర్,జూన్22(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడారు. మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ మాట్లాడుతూ ఖిల్లా ఘనపూర్ మండలానికి సాగునీటి సౌకర్యం కల్పించడంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. గణప సముద్రం రిజర్వాయర్, కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చి రైతులకు మేలు చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ రైతుబంధు, రైతు బీమా వంటి కీలక పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తూ అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత లభించిందని, ప్రస్తుతం రైతులు అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్షయవ్యాధి గుర్తింపే లక్ష్యంగా ప్రత్యేక ఆరోగ్య శిబిరం



**పెద్దమందడి,జూన్22(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం క్షయవ్యాధి గుర్తింపే లక్ష్యంగా ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి క్షయవ్యాధి లక్షణాలను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించగా, మొత్తం 68 మంది లబ్ధిదారులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం 22 మంది అనుమానితుల నమూనాలను తదుపరి నిర్ధారణ పరీక్షల కోసం పంపించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం, జిల్లా వైద్యశాఖ సిబ్బంది, క్షయవ్యాధి నియంత్రణ బృందం, ఏఎన్ఎం జ్యోతి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల ప్రగతే ధ్యేయం.. రైతు వేదికలో మండల స్థాయి సమీక్ష సమావేశం



**వేలేరు, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్పంచులు, అధికారులు పాల్గొన్న మండల స్థాయి సమన్వయ సమావేశం ఎంపీడీఓ కిషన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ కిషన్ నాయక్, డీఈఆర్డబ్ల్యూఎస్ శ్రీనివాస్, సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు-అధికారుల సమన్వయంతో గ్రామాలు, మండలం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మండలానికి ప్రత్యేక నిధులు మంజూరు అవుతున్నాయని, త్వరలో ఎమ్మార్వో, ఎంపీడీఓ కార్యాలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి, సర్పంచులు అశోక్, మనోజ్, అనిత, శ్రీనివాస్, మౌనిక, రమాదేవి, రాజు, సాంబయ్య, ఎంపీఓ బుచ్చిరెడ్డి, ఏఓ కవిత, ఎంఈఓ చంద్రమొగిలి, ఏఈ పీఆర్ రూపవతి, హౌసింగ్ ఏఈ అభిలాష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి, ఏపీఓ విజయ, ఏపీఎం అనితతో పాటు ఇరిగేషన్, మిషన్ భగీరథ, వైద్య, పశు సంవర్ధక, శిశు సంక్షేమ, హార్టికల్చర్ శాఖల అధికారులు, మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

# పేదల కన్నీళ్ల పై అధికార అహంకారం

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్**




**ఎల్కతుర్తి, జూన్ 22( తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. హనుమకొండ మండలం గుండ్ల సింగారం గ్రామంలో పేదలు నిర్మించుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీసు యంత్రాంగం జేసీబీలతో కూల్చివేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్ మాట్లాడుతూ, గుండ్ల సింగారంలో పేదలు నిర్మించుకున్న గుడిసెలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అర్ధరాత్రి సమయంలో కూల్చివేయడం దారుణమని అన్నారు. మహిళలు, చిన్నారులు ఉన్నా కనికరం చూపకుండా వ్యవహరించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల సమయంలో పేదలకు కూడు, గుడ్డ, నీడ కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే పేదల ఆశ్రయాలను నేలమట్టం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. పేదల కన్నీళ్లపై అధికార అహంకారం ప్రదర్శించడం సరికాదని, ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాలను పునరాలోచించాలని డిమాండ్ చేశారు.
కూల్చివేసిన గుడిసెలను యథావిధిగా పునర్నిర్మించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.
ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు తండ మొండయ్య, మంతుర్తి మల్లయ్య, మోహన్ రెడ్డి, వేముల కుమారస్వామి, వేముల కృష్ణకర్, ఎర్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి

*డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి*



**వనపర్తి,జూన్22(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.40వ ఒలింపిక్స్ డే సందర్భంగా తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకృష్ణయ్య స్టేడియంలో నిర్వహించిన ఒలింపిక్స్ డే టార్చ్ రన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రూ.576 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు.ఒలింపిక్ టార్చ్ శాంతి, ఐక్యత, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు.యువత గెలుపుఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు.అనంతరం ఒలింపిక్ టార్చ్‌ను వెలిగించి రన్‌ను ప్రారంభించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలి

- **తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన పట్టాదారులు**



**కొత్తకోట,జూన్22(తెలంగాణ ముచ్చట్లు):** తమ పట్టా భూమిని కబ్జా చేసిన వారి నుంచి రక్షించి న్యాయం చేయాలని కోరుతూ వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నాటేల్లి తండాకు చెందిన పట్టాదారులు సోమవారం తహసీల్దార్ సుభాష్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. నాటేల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 196, 197లో తమకు చెందిన భూమిని హైదరాబాద్‌కు చెందిన రాములు అనే వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకున్నాడని నారమ్మ, మంగ్యా నాయక్, నార్య నాయక్, బాలు నాయక్, సెన్యా నాయక్ ఆరోపించారు. రికార్డుల ప్రకారం అతనికి 4 ఎకరాల 22 గుంటల భూమి మాత్రమే ఉండగా, ప్రస్తుతం అదనంగా తమ భూమిని కూడా ఆక్రమించుకున్నాడని తెలిపారు.తమకు తెలియకుండా ప్రభావం, అధికారాన్ని ఉపయోగించి భూమిని కబ్జా చేశాడని, ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, భూమి విషయంలో అడిగితే తమపై దాడులకు కూడా పాల్పడుతున్నారని పేర్కొన్నారు.ఈ అంశాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.సర్వే నంబర్లు 196, 197లో పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, రికార్డుల ప్రకారం ఎవరి భూమి ఎంత ఉందో నిర్ధారించి తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.






# రైతు బాగుంటే రాజ్యం బాగుంటుంది అని నమ్మిన నాయకుడు కేసీఆర్

*మధిర నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ పార్టీ సమావేశం లో మాజీ ఎంపీ నామ*

**ఖమ్మం బ్యూరో, జూన్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** రైతు బాగుంటే రాజ్యం బాగుంటుంది అని నమ్మిన నాయకుడు, భారత దేశ చరిత్రలో రైతుకు అండగా నిలిచిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ మాజీ లోక్ సభాపక్ష నేత నామ నాగేశ్వరరావు, ఖమ్మం మాజీ ఎంపీ పేర్కొన్నారు. సోమవారం నాడు మధిర లో ఎస్. ఆర్ కన్వెన్షన్ నందు జెడ్పి మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం లో ఉమ్మడి ఖమ్మం జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్సీ తాత మధుసూదన్ లతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు మాయ మాటలు మోసపు మాటలు చెప్పి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తరువాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్ర రైతాంగానికి ఎరువులు ఇచ్చే పరిస్థితిలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం లేదని రాష్ట్రరైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను చూస్తే ఆవేదన కలుగుతుందన్నారు. కేసీఆర్ పాలనలో ఎంపీగా పార్లమెంట్ లో పోరాడితే అప్పటి కేంద్ర మంత్రి స్వయంగా ఎంపీ లు వద్దకు వచ్చి తెలంగాణ రైతాంగానికి ఎరువులు అందిస్తామన్నారని తెలియజేశారు. ముందు చూపు ఉన్న కేసీఆర్ నాయకత్వం లో ఆనాడు రైతులకు ఎరువుల కొరత రాలేదని గుర్తు చేశారు. నేడు రైతులు పండించిన పంటలు కొనుగోలు చేసే దిక్కు కూడా లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరి పై ఒకరు ఆరోపణలు చేసుకుంటుంటే మధ్యలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని తెలిపారు. జిల్లా ప్రజల ఆశీర్వాదం తో 17వ లోక్ సభలో గెలిపించి పార్లమెంట్ కి పంపిస్తే కేంద్రం వడ్లు కొనుగోలు చేయను అంటే కేసీఆర్ ఢిల్లీ వచ్చి ధర్నా చేయడం తో పాటుగా పార్లమెంట్ సభ్యులం అందరం పార్లమెంట్ ను స్తంభింప చేసి కేంద్రం మెడలు వంచి తెలంగాణ రైతులు పండించిన పంట కొనుగోలు చేయించడం జరిగిందని తెలిపారు. కేంద్రం మీదనే ఆధారపడకుండా రైతాంగం నుండి ప్రతి గింజ కొనుగోలు చేపించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యాభై వేల కోట్ల రూపాయల పైగా అభివృద్ధి జరిగిందని అదే సమయం లో మధిర నియోజకవర్గ వ్యాప్తంగా కూడా కోట్లాది రూపాయల అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న SIR పై అలానే పార్టీ సభ్యత్వ నమోదు పై బూత్ లెవెల్ లో పార్టీ శ్రేణులు చురుగ్గా పని చేయాలని కోరారు. కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకులు బొమ్మెర రామూర్తి, లీగల్ సెల్ నాయకులు తిరుమలరావు సహా పలువురు పాల్గొన్నారు

# హర్మ్యూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచ చమురు మార్కెట్లు కుదేలు

అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచ చమురు మార్కెట్లు ఒక్కసారిగా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. సోమవారం ఆసియా మార్కెట్లు ప్రారంభమైన వెంటనే ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి.



ప్రపంచ బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ధర సుమారు 1.24 శాతం పెరిగి బ్యారెల్‌కు 81.04 డాలర్లకు చేరింది. గరిష్ఠంగా 82.30 డాలర్ల వరకు నమోదు కావడం గమనార్హం. మరోవైపు అమెరికా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర కూడా 2.53 శాతం పెరిగి 77.77 డాలర్ల వద్ద కొనసాగుతోంది.పశ్చిమాసియాలో శాంతి కోసం స్విట్జర్లాండ్ వేదికగా అమెరికాఇరాన్ మధ్య జరుగుతున్న దౌత్య చర్చల సమయంలోనే ఈ పరిణామం చోటు చేసుకోవడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. చర్చలకు ఇది పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఇరాన్ సైనిక విభాగమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అమెరికా మద్దతుతో జరుగుతున్న చర్యలను కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనగా పేర్కొంది.

ఈ పరిణామంతో షిప్పింగ్ రంగంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. సాధారణంగా హర్మ్యూజ్ జలసంధి మీదుగా భారీగా చమురు రవాణా జరుగుతుంది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ఇక్కడి నుంచే జరుగుతుండటంతో, ఈ మార్గం మూసివేత గ్లోబల్ ఎనర్జీ సప్లై చైన్‌కు పెద్ద ప్రమాదంగా మారింది. శనివారం 26 వాణిజ్య నౌకలు ఈ మార్గం ద్వారా ప్రయాణించగా, ఆదివారం నాటికి ఆ సంఖ్య కేవలం ఐదుకు పడిపోయినట్లు అంతర్జాతీయ రవాణా గణాంకాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో ఎల్ఎన్‌జీ గ్యాస్ ఎగుమతులు కూడా ప్రభావితమయ్యే అవకాశాలు ఉన్నాయి. దౌత్య చర్చల సమయంలో ఉద్రిక్తతలు మరింత పెరగడం పరిస్థితిని సంక్లిష్టం చేస్తోంది. ఒకవైపు అమెరికా కఠిన చర్యల హెచ్చరికలు, మరోవైపు ఇరాన్ ప్రతిస్పందనతో ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లపై ఈ పరిణామాల ప్రభావం ఎలా ఉంటుందన్నదానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

# నోరా ఫతేహికి అరుదైన అంతర్జాతీయ గౌరవం

బాలీవుడ్ నటి, నర్తకి నోరా ఫతేహి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన లగ్జరీ బ్రాండ్ 'జాకబ్ అండ్ కో' గ్లోబల్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. ఈ ఘనతతో ఆమె గ్లోబల్ ఫ్యాషన్, లగ్జరీ రంగంలో మరో కీలక మైలురాయిని చేరుకున్నారు.

ఈ సందర్భంగా బ్రాండ్ వ్యవస్థాపకుడు జాకబ్ అరబో నోరా ఫతేహిని ప్రత్యేకంగా అభినందించి, సుమారు రూ. 35 లక్షల విలువైన లగ్జరీ వాచ్‌ను బహుమతిగా అందజేశారు. ప్రపంచవ్యాప్తంగా సెలబ్రిటీలు మాత్రమే ప్రాతినిధ్యం వహించే ఈ స్థాయి బ్రాండ్‌లో నోరా చోటు దక్కించుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. ఫిఫా ప్రపంచకప్ ప్రారంభ వేడుకల్లో తన డ్యాన్స్ ప్రదర్శనతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన నోరా, ఇప్పుడు లగ్జరీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికవడంతో ఆమె గ్లోబల్ క్రేజ్ మరింత పెరిగింది.

కెనడా నుంచి కేవలం కొద్దిపాటి డబ్బుతో ముంబైకి వచ్చి సినిమా అవకాశాల కోసం పోరాడిన నోరా, మొదట్లో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ తన డ్యాన్స్, పర్ఫార్మెన్స్‌తో బాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఐటమ్ సాంగ్స్, మ్యూజిక్ వీడియోలు, సినిమాల ద్వారా ఎదుగుతూ ప్రస్తుతం అంతర్జాతీయ బ్రాండ్‌ల స్థాయికి చేరుకున్నారు.

నోరా ఫతేహి ప్రయాణం వినోద పరిశ్రమలో కొత్తగా అడుగుపెడుతున్న యువతకు ప్రేరణగా నిలుస్తోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# గ్యాస్ ఉత్పత్తే భవిష్యత్ దిశగా ఓఎన్‌జీసీ

ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) వ్యాపార స్వరూపంలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయని సంస్థ చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ తెలిపారు. ఇప్పటి వరకు ముడి చమురు ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషించిన ఓఎన్‌జీసీ, ఇకపై గ్యాస్ ఉత్పత్తిని ప్రధాన ఆధారంగా మార్చుకుంటోందని ఆయన పేర్కొన్నారు.



భవిష్యత్తులో ఓఎన్‌జీసీని చమురుగ్యాస్ కంపెనీగా కాకుండా గ్యాస్‌చమురు కంపెనీగా చూడాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో సహజ వాయువుకు పెరుగుతున్న డిమాండ్, ధరల సంస్కరణలు, కొత్తగా అందుబాటులోకి వస్తున్న గ్యాస్ క్షేత్రాలు ఈ మార్పుకు ప్రధాన కారణాలని ఆయన తెలిపారు.

కొత్త చమురు నిక్షేపాలు కనుగొనబడకపోతే చమురు ఉత్పత్తి వృద్ధి పరిమితంగానే ఉంటుందని అరుణ్ కుమార్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే గుర్తించిన కొన్ని గ్యాస్ క్షేత్రాల్లో 2027-28 ఆర్థిక సంవత్సరం నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. సముద్ర గర్భ అన్వేషణలు, ఉత్పత్తి కార్యకలాపాల కోసం సంస్థ దాదాపు 33 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టుతోందని తెలిపారు.ఇక చమురు దిగుమతుల విషయానికి వస్తే, భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. మే నెలలో రోజుకు సగటున 19.1 లక్షల బ్యారళ్లుగా ఉన్న దిగుమతులు, జూన్ 19 నాటికి 26.6 లక్షల బ్యారళ్లకు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అదే సమయంలో యూఏఈ నుంచి దిగుమతులు స్వల్పంగా తగ్గగా, సౌదీ అరేబియా, వెనెజువెలా నుంచి స్థిరంగా కొనసాగుతున్నాయి. అమెరికా నుంచి దిగుమతులు మాత్రం గణనీయంగా తగ్గినట్లు సమాచారం. ఈ వివరాలు షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లర్ వెల్లడించినట్లు తెలుస్తోంది.దేశ ఇంధన అవసరాల్లో మారుతున్న పరిస్థితులు, సరఫరా మార్గాల్లో జరుగుతున్న మార్పులు భారత చమురు రంగంలో కొత్త సమీకరణాలను సూచిస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

# రాయల్ ఎన్‌ఫీల్డ్ తొలి ఎలక్ట్రిక్ బైక్ డెలివరీలు ప్రారంభం

ద్విచక్ర వాహన ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ తొలి ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ 'ఫ్లయింగ్ ఫ్లీ C6' డెలివరీలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో అధికారికంగా విడుదలైన ఈ మోడల్‌ను ప్రస్తుతం తొలి దశలో బెంగళూరులో వినియోగదారులకు అందజేస్తున్నారు.

ఈ బైక్ ఎక్స్‌షోరూమ్ ధర రూ. 2.79 లక్షలుగా నిర్ణయించగా, బ్యాటరీఏజ్ఏసర్వీస్ విధానంలో కొనుగోలు చేస్తే ప్రారంభ ధర రూ. 1.99 లక్షలుగా ఉంటుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ విభాగం 'ఫ్లయింగ్ ఫ్లీ' బ్రాండ్ కింద తీసుకొచ్చిన తొలి మోడల్ ఇదే కావడం విశేషం.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఉన్న క్లాసిక్ 'ఫ్లయింగ్ ఫ్లీ' బైక్ స్ఫూర్తితో ఆధునిక ఎలక్ట్రిక్ టెక్నాలజీని కలిపి ఈ మోడల్‌ను రూపొందించారు. తేలికపాటి అల్యూమినియం ఫ్రేమ్, నియోరెట్రో డిజైన్ దీని ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

ఈ బైక్‌లో 3.91 కిలోవాట్‌గంటల లిథియంఅయాన్ బ్యాటరీని అమర్చారు. ఇది 15.4 కిలోవాట్ల శక్తి ఉత్పత్తి చేసే మోటార్‌తో పనిచేస్తుంది. గరిష్ఠ వేగం గంటకు 115 కిలోమీటర్లు కాగా, ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే సుమారు 154 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ ప్రకటించింది. 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 3.7 సెకన్లలో అందుకుంటుంది.

చార్జింగ్ పరంగా కూడా ఇది వేగవంతమైన సదుపాయాన్ని అందిస్తోంది. 0 నుంచి 100 శాతం వరకు చార్జ్ కావడానికి సుమారు 2 గంటల 16 నిమిషాలు పడుతుండగా, 20 నుంచి 80 శాతం వరకు కేవలం 65 నిమిషాల్లో చార్జ్ అవుతుంది. ఇంటి విద్యుత్ కనెక్షన్‌తోనే సులభంగా చార్జింగ్ చేసుకునే అవకాశం ఉంది.

ఆధునిక ఫీచర్ల విషయానికి వస్తే, 3.5 అంగుళాల టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ, నావిగేషన్, కీలెస్ ఆపరేషన్, వైర్‌లెస్ చార్జింగ్, బ్లూటూత్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. అలాగే రీజెనరేటివ్ బ్రేకింగ్, రైడింగ్ మోడ్‌లు, ట్రాక్షన్ కంట్రోల్ వంటి భద్రతా ఫీచర్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

కేవలం 124 కిలోల బరువుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ చరిత్రలోనే అత్యంత తేలికైన మోడల్‌గా ఇది నిలిచింది. నగర ప్రయాణాలకు అనువుగా దీనిని ప్రత్యేకంగా రూపకల్పన చేశారు.

పెట్రోల్ బైక్‌లకు ప్రసిద్ధి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్, ఇప్పుడు ఎలక్ట్రిక్ విభాగంలోకి ప్రవేశించడంతో ఆటోమొబైల్ మార్కెట్‌లో కొత్త పోటీ ప్రారంభమైంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఇంజినీరింగ్‌లో మహిళల అడుగులు..
# అభివృద్ధికి కొత్త దిశ

ఆధునిక ప్రపంచ నిర్మాణంలో ఇంజినీరింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. వంతెనల నిర్మాణం నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు, సమాచార సాంకేతికత నుంచి వైద్య పరికరాల అభివృద్ధి వరకు ప్రతి రంగంలో ఇంజినీర్ల కృషి కనిపిస్తుంది. ఈ రంగంలో మహిళల సేవలను గుర్తించి, మరింత మంది యువతులు ఇంజినీరింగ్ వైపు అడుగులు వేయాలని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 23న అంతర్జాతీయ మహిళా ఇంజినీర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా ఇంజినీర్ల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ఒకప్పుడు ఇంజినీరింగ్ పూర్తిగా పురుషుల ఆధిపత్య రంగంగా భావించబడేది. అయితే కాలక్రమేణా మహిళలు కూడా ఈ రంగంలో తమ ప్రతిభను చాటుతూ అనేక విజయాలు సాధించారు. నేడు నిర్మాణ, యాంత్రిక, విద్యుత్, సమాచార సాంకేతిక, అంతరిక్ష, జీవసాంకేతిక రంగాల్లో వేలాది మంది మహిళలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తమ నైపుణ్యంతో ప్రపంచ అభివృద్ధికి తోడ్పడుతున్నారు.

భారతదేశంలో కూడా ఇంజినీరింగ్ విద్యలో మహిళల భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోంది. అనేక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో బాలికల ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. ఉన్నత విద్యను అభ్యసించి దేశీయ, అంతర్జాతీయ సంస్థల్లో కీలక స్థానాలు దక్కించుకుంటున్నారు. ఈ మార్పు సమాజంలో మహిళల సాధికారతకు నిదర్శనంగా నిలుస్తోంది. అంతరిక్ష పరిశోధనల్లో మహిళా ఇంజినీర్లు సాధించిన విజయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. ఉపగ్రహాల రూపకల్పన, ప్రయోగ వాహనాల అభివృద్ధి, అంతరిక్ష పరిశోధన ప్రాజెక్టుల నిర్వహణలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. క్లిష్టమైన సాంకేతిక సవాళ్లను అధిగమిస్తూ కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

సమాచార సాంకేతిక రంగంలో మహిళల పాత్ర మరింత విస్తరించింది. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, డేటా విశ్లేషణ వంటి ఆధునిక రంగాల్లో మహిళలు తమ ముద్ర వేస్తున్నారు. ప్రపంచంలోని ప్రముఖ సంస్థల్లో నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ సాంకేతిక ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నారు. అయితే ఇప్పటికీ ఇంజినీరింగ్ రంగంలో మహిళలు కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ అవకాశాల్లో అసమానతలు, నాయకత్వ స్థానాల్లో తక్కువ ప్రాతినిధ్యం, కుటుంబఉద్యోగ బాధ్యతల సమతుల్యత వంటి అంశాలు కొన్నిసార్లు అడ్డంకులుగా మారుతున్నాయి. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాలికలు కూడా ఇంజినీరింగ్ రంగంలో ముందుకు రావాలంటే నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలి. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక పరిమితులు వారి కలలకు అడ్డంకిగా మారకూడదు. విద్యా వేతనాలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, మార్గదర్శకత్వం వంటి చర్యలు మరింత మంది యువతులను ఈ రంగంలోకి తీసుకురాగలవు. మహిళా ఇంజినీర్లు కేవలం సాంకేతిక అభివృద్ధికే కాకుండా సామాజిక మార్పుకు కూడా దోహదపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన ఇంధన వనరులు, గ్రామీణాభివృద్ధి, ప్రజా ఆరోగ్య రంగాల్లో వినూత్న పరిష్కారాలను అందిస్తున్నారు. సమాజ అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను ఉపయోగించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నారు.

అంతర్జాతీయ మహిళా ఇంజినీర్ల దినోత్సవం యువతులకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. ప్రతిభ, కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా మహిళలు అత్యున్నత స్థానాలను చేరుకోగలరని ఈ దినోత్సవం తెలియజేస్తోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగితే దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. భవిష్యత్తు సాంకేతిక ప్రపంచ నిర్మాణంలో మహిళల పాత్ర మరింత కీలకంగా మారనుంది. ఇంజినీరింగ్ రంగంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా వినూత్న ఆవిష్కరణలు, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయి. మహిళల ప్రతిభకు తగిన గుర్తింపు లభించినప్పుడే సమానత్వ సమాజ నిర్మాణం సాకారం అవుతుంది.

## ప్రజా సేవలు బలోపేతమైతేనే ప్రజాస్వామ్యం పరిపుష్టం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తాయి. అయితే ఆ నిర్ణయాలు ప్రజలకు చేరే మార్గం ప్రజా సేవా వ్యవస్థ. అందుకే ప్రజా సేవలను ఏ దేశానికైనా వెన్నెముకగా అభివర్ణిస్తారు. ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరాలంటే ప్రజా సేవలు సమర్థవంతంగా పనిచేయాలి. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం జూన్ 23న నిర్వహించే ఐక్యరాజ్యసమితి ప్రజా సేవల దినోత్సవం ప్రజా సేవల ప్రాముఖ్యతను ప్రపంచానికి గుర్తుచేస్తోంది. ఒక దేశ అభివృద్ధిని కేవలం ఆర్థిక వృద్ధితో మాత్రమే కొలవలేం. ప్రజలకు విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి అవకాశాలు ఎంత మేరకు అందుతున్నాయనే అంశం కూడా ముఖ్యమైన ప్రమాణం. ఈ సేవలను ప్రజల గడప వద్దకు తీసుకెళ్లే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంటుంది. ప్రజా సేవలు బలంగా ఉంటేనే ప్రభుత్వ విధానాలు విజయవంతమవుతాయి.స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం ప్రజా సేవల రంగంలో గణనీయమైన పురోగతి సాధించింది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా వంటి రంగాల్లో కోట్లాది మంది ప్రభుత్వ ఉద్యోగులు సేవలందిస్తున్నారు. అయితే జనాభా పెరుగుదల, మారుతున్న అవసరాలు, పట్టణీకరణ వంటి కారణాల వల్ల ప్రజా సేవలపై ఒత్తిడి కూడా పెరుగుతోంది. అందువల్ల సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. సాంకేతిక విప్లవం ప్రజా సేవల రూపురేఖలను మార్చింది. ఒకప్పుడు చిన్న పనికైనా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అనేక సేవలు ఇంటి వద్ద నుంచే పొందే అవకాశం ఏర్పడింది. ధ్రువపత్రాలు, పన్నుల చెల్లింపులు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, భూ రికార్డులు వంటి అనేక సేవలు డిజిటల్ రూపంలో అందుబాటులోకి వచ్చాయి. ఇది ప్రజలకు సమయం, ఖర్చు ఆదా చేయడమే కాకుండా పారదర్శకతను కూడా పెంచుతోంది. అయితే సాంకేతికత అందరికీ సమానంగా అందుబాటులో లేదనే వాస్తవాన్ని విస్మరించరాదు. గ్రామీణ ప్రాంతాలు, వృద్ధులు, నిరక్షరాస్యులు ఇంకా అనేక సేవలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిజిటల్ సేవల విస్తరణతో పాటు డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడంపై కూడా ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. లేకపోతే సాంకేతికత కొత్త అసమానతలకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రజా సేవల విజయానికి పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత కీలకం. ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం కావాలంటే అవినీతి, నిర్లక్ష్యం, జాప్యం వంటి అంశాలకు తావు లేకుండా చూడాలి. సేవల నాణ్యతను పర్యవేక్షించే వ్యవస్థలు మరింత బలోపేతం కావాలి. ప్రజల అభిప్రాయాలను స్వీకరించి సేవలను మెరుగుపరచే సంస్కృతి ప్రభుత్వ యంత్రాంగంలో పెరగాలి. ప్రజా సేవల్లో పనిచేసే ఉద్యోగుల పాత్రను కూడా సమాజం గుర్తించాలి. ప్రకృతి విపత్తులు, మహమ్మారులు, అత్యవసర పరిస్థితుల సమయంలో వారు చేసిన సేవలు అమూల్యమైనవి. కరోనా మహమ్మారి సమయంలో వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు చేసిన సేవలను దేశం ఎప్పటికీ మరిచిపోలేదు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించే వారికి తగిన గౌరవం, ప్రోత్సాహం లభించాలి. ప్రజా సేవలు కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సేవలను సద్వినియోగం చేసుకోవడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడటం, అధికారులతో సహకరించడం వంటి అంశాలు ప్రజల కర్తవ్యాల్లో భాగం. ప్రజలు, ప్రభుత్వం పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే సేవల నాణ్యత పెరుగుతుంది. భవిష్యత్తులో ప్రజా సేవలు మరింత ప్రజా కేంద్రంగా మారాల్సిన అవసరం ఉంది. కృత్రిమ మేధస్సు, డేటా విశ్లేషణ, డిజిటల్ పరిష్కారాల సహాయంతో సేవలను మరింత వేగంగా, సమర్థవంతంగా అందించవచ్చు. అయితే సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా మానవీయత, బాధ్యత, సేవా భావం ప్రజా సేవల అసలు బలం అనే విషయాన్ని మరచిపోరాదు. ఐక్యరాజ్యసమితి ప్రజా సేవల దినోత్సవం సందర్భంగా ప్రజా సేవల విలువను మరోసారి గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని పనిచేసే పరిపాలనా వ్యవస్థే నిజమైన ప్రజాస్వామ్యానికి ప్రతీక. ప్రజా సేవలు బలోపేతమైతే ప్రజల విశ్వాసం పెరుగుతుంది. ప్రజల విశ్వాసం పెరిగితేనే దేశాభివృద్ధి వేగవంతమవుతుంది. అందువల్ల సమర్థవంతమైన, పారదర్శకమైన, ప్రజా కేంద్రిత సేవల నిర్మాణమే నేటి కాలపు ప్రధాన అవసరంగా మారింది. ప్రజా సేవల్లో పనిచేసే ఉద్యోగుల పాత్రను కూడా సమాజం గుర్తించాలి. ప్రకృతి విపత్తులు, మహమ్మారులు, అత్యవసర పరిస్థితుల సమయంలో వారు చేసిన సేవలు అమూల్యమైనవి. కరోనా మహమ్మారి సమయంలో వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు చేసిన సేవలను దేశం ఎప్పటికీ మరిచిపోలేదు.

## వితంతు మహిళలకు సమాజం అండగా నిలవాలి

భర్తను కోల్పోయిన తర్వాత జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళల సమస్యలపై ప్రపంచ దృష్టిని ఆకర్షించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 23న అంతర్జాతీయ వితంతు మహిళల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సమాజంలో వితంతు మహిళలు ఎదుర్కొనే వివక్ష, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక నిర్లక్ష్యం వంటి అంశాలపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది మహిళలు భర్త మరణం అనంతరం అనేక కష్టాలను ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్న నేపథ్యంలో వారి హక్కుల పరిరక్షణకు ఈ దినోత్సవం ఒక వేదికగా నిలుస్తోంది. భర్త మరణం తర్వాత కుటుంబ బాధ్యతలన్నీ ఒక్కసారిగా మహిళ భుజాలపై పడిపోతాయి. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, ఆర్థిక వ్యవహారాలు అన్నింటినీ ఒంటరిగా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. చాలామంది మహిళలకు స్థిరమైన ఆదాయ వనరు లేకపోవడంతో జీవనోపాధి కోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది.

ప్రపంచంలోని కొన్ని దేశాల్లో ఇప్పటికీ వితంతు మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. కుటుంబ ఆస్తులపై హక్కులు నిరాకరించడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం, కుటుంబ నిర్ణయాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. ఆర్థిక స్వావలంబన లేకపోవడం వితంతు మహిళల ప్రధాన సమస్యగా మారుతోంది. ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల వారు ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొందరు చిన్నచిన్న పనులు చేస్తూ కుటుంబాలను పోషించేందుకు కష్టపడుతున్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంది.

మానసికంగా కూడా వితంతు మహిళలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. జీవిత భాగస్వామిని కోల్పోయిన బాధతో పాటు భవిష్యత్తుపై అనిశ్చితి వారిని కలవరపెడుతోంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజం నుంచి లభించే మద్దతు వారికి ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. విద్యాభావం కూడా అనేక మహిళలకు సమస్యగా మారుతోంది. సరైన విద్య లేకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి. దీంతో ఆర్థికంగా బలపడే అవకాశాలు కూడా పరిమితమవుతున్నాయి. మహిళలకు విద్య, వృత్తి శిక్షణ అందించడం ద్వారా వారి భవిష్యత్తును మరింత మెరుగుపరచవచ్చని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

ప్రభుత్వాలు వితంతు మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. పింఛన్లు, స్వయం ఉపాధి రుణాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు వంటి సదుపాయాలు అందిస్తున్నాయి. అయితే ఈ పథకాల ప్రయోజనాలు గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి మహిళకు చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

స్వచ్ఛంద సంస్థలు కూడా వితంతు మహిళల సాధికారత కోసం కీలక పాత్ర పోషిస్తున్నాయి. వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం, న్యాయ సహాయం అందించడం, స్వయం సహాయక బృందాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ ప్రయత్నాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయి. వితంతు మహిళలను జాలితో కాకుండా గౌరవంతో చూడాల్సిన అవసరం ఉంది. సమాజంలో వారికి సమాన అవకాశాలు కల్పించి, వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. కుటుంబాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడం సాధ్యమవుతుంది. అంతర్జాతీయ వితంతు మహిళల దినోత్సవం సమాజానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది. మహిళల హక్కులను గౌరవించడం, వివక్షను రూపుమాపడం, వారికి ఆర్థిక సామాజిక భద్రత కల్పించడం ద్వారా మాత్రమే సమానత్వ సమాజాన్ని నిర్మించగలం. వితంతు మహిళలు కూడా గౌరవప్రదమైన జీవితం గడపగలిగే పరిస్థితులు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఉంది.





## సంధ్య థియేటర్ ఘటన కేసు అల్లు అర్జున్ డుమ్మాతో వచ్చే నెలకి వాయిదా

టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్‌కు సంబంధించి సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 'పుష్ప2: ది రూల్' స్పెషల్ ప్రీమియర్ సందర్భంగా జరిగిన విషాద ఘటనకు సంబంధించిన కేసును విచారిస్తున్న హైదరాబాద్ నాంపల్లి క్రిమినల్ కోర్టు అల్లు అర్జున్‌కు సమన్లు జారీ చేసింది. జూన్ 22న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఆయన వృత్తిపరమైన పనులతో బిజీగా ఉండటంతో హాజరుకాలేదని సమాచారం. ఈ నేపథ్యంలో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టును అభ్యర్థించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో కేసులో ఇతర నిందితులు కోర్టుకు హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. తదుపరి విచారణను న్యాయస్థానం జూలై 6కి వాయిదా వేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4న ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో చోటుచేసుకుంది. 'పుష్ప2' స్పెషల్ ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో తీవ్ర రద్దీ ఏర్పడింది. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి (39) అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.




## వెంకటేష్-కళ్యాణ్‌రామ్ చిత్రం సందడి

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ కథానాయకులుగా దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న మల్టీస్టారర్ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైన ఈ సినిమాకు సంబంధించిన తాజా ప్రచార వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. హాస్యం, సరదా సంభాషణలు, కథ నేపథ్యానికి సంబంధించిన ఆసక్తికర సంకేతాలతో రూపొందించిన ఈ వీడియో సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఆదివారం విడుదలైన ఈ ప్రత్యేక వీడియోలో వెంకటేష్, కళ్యాణ్‌రామ్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ మధ్య జరిగిన సరదా సంభాషణలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. "పాపం అనిల్‌ను ఇసుకలో పాతేశారట" అంటూ వెంకటేష్ సరదాగా వ్యాఖ్యానించగా, "పటాస్ సమయంలో బాగానే ఉన్నాడు.. కానీ 'నేను పాడతా' అని మీరే ఇలా చేశారంటూ" కళ్యాణ్‌రామ్ చమత్కరించడం నవ్వులు పూయించింది.

అంతలోనే కథానాయికలు కీర్తి సురేష్, కృతి శెట్టి భయపడుతూ అక్కడికి పరుగెత్తుకుంటూ రావడం, వారి వెనుక చేతిలో కత్తితో దర్శకుడు అనిల్ రావిపూడి ఎంట్రీ ఇవ్వడం వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. "కత్తిలాంటి ఆలోచనలతో ప్రచారం చేస్తున్నానని అభిమానులే నా చేతిలో కత్తి పెట్టారు" అంటూ అనిల్ చేసిన వ్యాఖ్యలు వినోదాన్ని మరింత పెంచాయి. అంతేకాక, ఎప్పుడూ తానే కొత్త ఆలోచనలు చెప్పాలా, ఈసారి మీరు ఏదైనా కొత్త ఐడియా చెప్పాలని అనిల్ హీరోలను అడగగా.. వెంకటేష్ "కత్తిలాంటి ఆలోచన" అంటూ అనిల్ వేలు కోసినట్లు నటిస్తూ రక్తంతో విజయ తిలకం దిద్దడం సరదాగా చూపించారు. ఆ తర్వాత కళ్యాణ్‌రామ్, కథానాయికలు కూడా అదే తరహాలో పాల్గొనడం వీడియోకు హాస్యరసాన్ని తెచ్చిపెట్టింది.

## శ్రీలీలతో వేదికపై ఘటన వైరల్




అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముంబైలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చోటుచేసుకున్న ఒక సంఘటన సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సతీమణి అమృత ఫడ్నవీస్, బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్, టాలీవుడ్ నటి శ్రీలీలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని యోగాసనాలు చేశారు. అయితే కార్యక్రమం ముగిసిన అనంతరం ఫొటో సెషన్ సమయంలో జరిగిన చిన్న పరిణామం ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. యోగా కార్యక్రమం అనంతరం అమృత ఫడ్నవీస్, ఆమె కుమార్తె, శ్రీలీల కలిసి మీడియా ఫొటోగ్రాఫర్లకు ఫోజులు ఇచ్చారు. ఈ క్రమంలో కొందరు ఫొటోగ్రాఫర్లు కేవలం అమృత ఫడ్నవీస్, ఆమె కుమార్తెతో మాత్రమే చిత్రాలు కావాలని కోరినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో పక్కనే నిలబడి ఉన్న శ్రీలీలకు అమృత ఫడ్నవీస్ చేతి సైగతో పక్కకు జరగమని సూచించినట్లు కనిపిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. ఆ సమయంలో శ్రీలీల కొంత అసౌకర్యంగా కనిపించిందంటూ పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఈ వీడియో వెలుగులోకి వచ్చిన తరువాత అమృత ఫడ్నవీస్ వ్యవహారశైలిపై కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక ప్రముఖ నటితో మరింత మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు మాత్రం ఇది ఫొటో సెషన్‌లో సహజంగా జరిగే చిన్న సంఘటన మాత్రమేనని, దాన్ని అనవసరంగా వివాదంగా మలుస్తున్నారని అంటున్నారు. ఈ ఘటనపై ఇప్పటివరకు శ్రీలీల గానీ, అమృత ఫడ్నవీస్ గానీ అధికారికంగా స్పందించలేదు.



# వైరల్‌గా మారిన భాగ్యశ్రీ బోర్సే షాకింగ్ స్టిల్స్

యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో వరుస అవకాశాలతో దూసుకెళ్తోంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ భామ, తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్లు, ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ మంచి క్రేజ్ సంపాదిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఓ వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అఖిల్ అక్కినేని హీరోగా నటిస్తున్న 'లెనిన్' చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఈ క్రమంలో భాగ్యశ్రీ పంచుకున్న తాజా విజువల్స్ నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. భాగ్యశ్రీ బోర్సే కెరీర్‌కు పెద్ద బ్రేక్ ఇచ్చిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఈ సినిమాలో ఆమె నటనకు గాను ఉత్తమ నటి (తొలి చిత్రం) విభాగంలో సైమా అవార్డు అందుకుని ప్రత్యేక గుర్తింపు పొందింది. ఆ తర్వాత వరుసగా పెద్ద ప్రాజెక్టుల్లో అవకాశాలు అందుకుంటూ దక్షిణాది సినీ పరిశ్రమలో తన స్థానాన్ని బలపరుచుకుంది.

ఇటీవల గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన 'కింగ్డమ్' చిత్రంలో కూడా ఆమె నటించింది. అలాగే దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన తమిళ చిత్రం 'కాంత' ద్వారా తమిళ ప్రేక్షకులకు మరింత చేరువైంది. ఈ చిత్రాల్లో ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి.

ఇక 2026లో విడుదల కానున్న ప్రాజెక్టులపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. తెలుగు చిత్రం 'లెనిన్'తో పాటు, శివకార్తికేయన్ నటిస్తున్న, కమల్ హాసన్ నిర్మిస్తున్న తమిళ యాక్షన్ డ్రామా 'సెయోన్'లోనూ భాగ్యశ్రీ కీలక పాత్రలో కనిపించనుంది. వరుస అవకాశాలతో ఈ యువ కథానాయిక దక్షిణాది చిత్ర పరిశ్రమలో తన జోరు కొనసాగిస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జాతీయ స్థాయిలో సత్తా చాటిన వేలేరు బాలుడు.. కిక్‌బాక్సింగ్‌లో కాంస్య పతకం



**వేలేరు, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్యప్రదేశ్‌లోని ఇందోర్ నగరంలో ఈ నెల 17 నుండి 21 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో వేలేరు మండల కేంద్రానికి చెందిన ఎం.డి. ఫర్హాన్ ప్రతిభ కనబరిచి సబ్ జూనియర్స్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. జాతీయ స్థాయిలో పతకం సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచిన ఫర్హాన్‌ను క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# జర్నలిస్ట్ జానీపాషా జన్మదినం సేవామయం

- **ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ**
- **టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుని పిలుపుతో ముందుకొచ్చిన జర్నలిస్టులు**

**ఖమ్మం బ్యూరో , జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా నాయకులు, సీనియర్ జర్నలిస్ట్, షేక్ జానీ పాషా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం సేవా కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ పిలుపు మేరకు జర్నలిస్టులు, సంఘ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జన్మదిన వేడుకలను కేవలం కేక్ కటింగ్‌కే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, అక్రిడీటేషన్ కమిటీ సభ్యురాలు మధుశ్రీ, ప్రముఖ యాంకర్ సిరి, యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి గరిదేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు సయ్యద్ అంజద్, కొరకొప్పుల రాంబాబు, ఇతర జర్నలిస్టు మిత్రులు పాల్గొని జానీ పాషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



# అక్షర దీపాలు వెలిగిస్తున్న ఆదర్శ ఉపాధ్యాయులు

**ఎల్కతుర్తి, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు డి. రాజిరెడ్డి, అరవింద, ఉమా విద్యార్థుల పట్ల తమ సేవా భావాన్ని చాటుకున్నారు. చిన్నారుల విద్యాభివృద్ధే ధ్యేయంగా తమ సొంత డబ్బులతో సుమారు రూ.10 వేల విలువైన నోట్‌బుక్స్‌ను కొనుగోలు చేసి పాఠశాలలోని విద్యార్థులందరికీ పంపిణీ చేశారు.

విద్యార్థులు చదువులో మరింత ముందుకు సాగాలని, వారికి అవసరమైన విద్యా సామగ్రి అందుబాటులో ఉండాలని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠాలు చెప్పడమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొల్లపల్లి సంపత్ మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం కోసం ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నోట్‌బుక్స్ పంపిణీ చేయడం ఆదర్శప్రాయమని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు. నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులను అభినందించి వారి సేవా తత్వాన్ని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ అక్షర దీపాలు వెలిగిస్తున్న ఈ ఆదర్శ ఉపాధ్యాయుల సేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.







# భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి

**ఖమ్మం బ్యూరో, జూన్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తి గత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు, ప్రజలకు కూడా విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ సంజీవ్, ఎస్సై జగదీశ్ పాల్గొన్నారు.






# రైతు మేళా, ముఖ్యమంత్రి సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి...

## జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

**ఖమ్మం బ్యూరో , జూన్ -22(తెలంగాణ ముచ్చట్లు ):** జూన్ 28, 29 తేదీలలో నిర్వహించే రైతు మేళా, జూన్ 30న మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.

పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి కలెక్టర్, చింతకాని మండలంలోని సభా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమం కోసం భారీ స్థాయిలో సిబ్బందిని వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. అదనపు కలెక్టర్, చింతకాని తహసీల్దార్‌లు సభా స్థలాన్ని పూర్తిస్థాయిలో క్లియర్ చేసి సిద్ధం చేయాలని ఆదేశించారు. సభ నిర్వహణ కోసం మొత్తం 25 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేయాలని, అందులో 20 ఎకరాలను బహిరంగ సభకు, 5 ఎకరాలను ప్రదర్శన స్టాల్స్ కోసం కేటాయించాలని సూచించారు. అదనంగా వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

జూన్ 28, 29 తేదీలలో రైతు మేళా, జూన్ 30న ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించనున్నందున అందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సుమారు 150 స్టాల్స్ ఏర్పాటు చేయాలని, రైతులతో చర్చించి వాటి స్థలాన్ని ఖరారు చేయాలని తెలిపారు. వేదికను ఏర్పాటు చేసి సమావేశ లేఅవుట్ రూపొందించాలని ఆదేశించారు.

సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలని, రెండు ప్రాంతాలకు వేర్వేరుగా ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి కార్యక్రమం రోజు సరైన పార్కింగ్, కార్యక్రమ అనంతరం సక్రమంగా తిరిగి పంపించడం వరకు లైజన్ అధికారులు బాధ్యత వహించాలని తెలిపారు. మూడు రోజుల కార్యక్రమాలకు ఆహారం, త్రాగునీటి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. స్టాల్ సిబ్బంది, శిక్షణ సిబ్బంది, విధుల్లో ఉండే ఉద్యోగులకు ప్రత్యేక ఆహార కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యక్రమం రోజున బస్సుల సమయాలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమం ప్రారంభం, ముగింపు సమయంలో నాణ్యమైన ప్యాకెట్ భోజనం అందించాలని తెలిపారు.

ఆర్ అండ్ బి శాఖ భూమి లెవెలింగ్, అవసరమైన బ్యారికేడింగ్ పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయంతో సమన్వయం చేసుకొని ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందాన్ని ఖరారు చేయాలని, ఎల్‌ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్‌లు ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, సభా ప్రాంగణంలో ప్రతి 250 మందికి ఒక బాధ్యుడిని నియమించి నీటి పంపిణీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. స్టాల్స్, ప్రదర్శన ప్రాంతాల వద్ద కూడా త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు.

ప్రతి వ్యయాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలని, అన్ని ఖర్చులు ఆడిట్‌కు లోబడి ఉంటాయని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, కార్యక్రమం ముగిసిన అనంతరం ప్రైవేట్ స్థలాలను పూర్తిగా శుభ్రపరిచి యథాతథ స్థితిలో తిరిగి అప్పగించాలని ఆదేశించారు. వేదిక నిర్వహణకు ఆర్డీవోను ఇన్‌చార్జిగా నియమించి పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రాలు పంపించాలని, డీఆర్ఓ జిల్లా స్థాయి ప్రోటోకాల్ ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అన్ని భద్రతా అంశాలను పరిశీలించాలని, సమాచార పౌర సంబంధాల శాఖ ఆడియో, వీడియో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సూచించారు. వేదికపై అతిథులకు అల్పాహారం, భోజన ఏర్పాట్ల కోసం ప్రత్యేక ప్రోటోకాల్ బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు.అవసరమైన డ్యూటీ పాసులు, వాహన పాసులు సిద్ధం చేసి, ఏ పాస్‌కు ఎక్కడి వరకు ప్రవేశం ఉంటుందో స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. అవసరానికి 10 శాతం అదనపు పాసులు ముద్రించి సిద్ధంగా ఉంచాలని, కార్యక్రమానికి 48 గంటల ముందు తుది జాబితాను ఖరారు చేసి పోలీసు శాఖకు అందించాలని సూచించారు.

విద్యుత్ శాఖ ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, అవసరమైన బ్యాకప్ ఏర్పాట్లు కల్పించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు తమ సిబ్బందిని పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమానికి వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు.

నగర పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ గుర్తించిన స్థలాన్ని పూర్తి స్థాయిలో లెవెలింగ్ చేయాలని, పార్కింగ్ ప్రాంతాలకు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను పకడ్బందీగా రూపొందించాలని సూచించారు.

ముఖ్యమంత్రి హెలికాప్టర్‌తో పాటు మంత్రులు కూడా హెలికాప్టర్ల ద్వారా వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు వేర్వేరు హెలిప్యాడ్ ప్రదేశాలను గుర్తించాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సభా ప్రాంగణానికి వెళ్లే అన్ని రహదారులను పరిశీలించి అవసరమైన మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాల తొలగింపు, చెట్ల తొలగింపు పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. వేదిక సిబ్బంది, బ్యాక్ స్టేజ్ సిబ్బంది విధుల జాబితాలను ప్రత్యేకంగా సిద్ధం చేసి ముందుగానే పోలీసు శాఖకు అందించాలని కమీషనర్ సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో 10,922 కేసుల పరిష్కారం

- **సైబర్ బాధితులకు రూ.1.17 కోట్ల రిఫండ్**

**వరంగల్, జూన్ 22 (తెలంగాణ ముచ్చట్లు):-** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా మొత్తం 10,922 కేసులు పరిష్కారమయ్యాయని వెల్లడించారు. పరిష్కారమైన కేసుల్లో 1,880 ఎఫ్ఐఆర్ కేసులు, 2,864 విపత్తు నిర్వహణ చట్టం కేసులు, 201 ఈ పెట్టి కేసులు, 5,977 డ్రంకెన్ అండ్ డ్రైవ్, మోటార్ వాహన చట్టానికి సంబంధించిన కేసులు, 197 సైబర్ నేరాల కేసులు ఉన్నట్లు తెలిపారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను ఇరు పక్షాల అంగీకారంతో పరిష్కరించినట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితులకు ఉపశమనం కల్పించేలా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిందన్నారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో నిలుపుదల చేసిన రూ.1,17,95,706 మొత్తాన్ని బాధితులకు తిరిగి చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించినట్లు వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల న్యాయస్థానాలపై భారం తగ్గడంతో పాటు బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని సీపీ పేర్కొన్నారు. రాజీ మార్గం ద్వారా వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు. అలాగే లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవా సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సులభంగా పరిష్కరించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in